# * విముక్తి *

* రచన: "మరామ" *

●

నా తండ్రి అజ్ఞాని. ఆ అజ్ఞానంలో మూర్ఖత్వం...కోపం. తండ్రి చెడ్డవాడంటే లోకం నమ్మదు. అందుచేతనే నేనింతవఱకు అటువంటివి వ్రాద్దామన్నా ఏవో శక్తులు నన్నడ్డగిస్తున్నాయి...ప్రపంచం నమ్మదు. నా తండ్రి చెడ్డవాడంటే...పైకిమాత్రం పెద్దమనిషిలా తిరుగుతాడు...మాట్లాడుతుంటాడు...

పైకి అమృతం...హృదయంలో హాలాహలం...అదంతా ఎవరికి తెలుసు.

నిజమే కన్నకొడుకే తండ్రిని అంత నీచంగా చూస్తున్నాడంటే లోకమంతా తిట్టిపోస్తుంది....

ఇన్ని సంవత్సరాలుండి ఆయన దుష్ప్రవర్తనను అరికట్టి ఆయన్ని మంచితనంలోకి తీసుకురావాలని ప్రయత్నించాను. అజ్ఞానుడు...మూర్ఖుడు మంచిలోకి రావాలంటే ఎలావస్తాడు. పైగా వ్రేలెడున్నావో లేదో నాకు నీతులు చెప్పొచ్చావా అని తిట్టడం అనేకసార్లు పరిపాటయింది.

కేవలం మూర్ఖత్వం...క్రూరత్వం అతని నేత్రాల్లోంచే వెలిగ్రక్కుతూ వుంటుంది...

ఆ సంగతి ఎవరికీ తెలియదు. ఆయనంటే అందరూ మర్యాదగానే చూస్తుంటారు. అతను చెప్పే తియ్యని మాటల్నిబట్టి గౌరవిస్తారు.

కాని ఆయనమాత్రం పరుల్ని గౌరవముగా చూస్తాడనుకున్నారా! వాళ్ళ ముందు మంచిమాటలు చెప్పుతాడు. వాళ్ళు వెళ్ళిన తర్వాత వాళ్ళనే దూషిస్తాడు. అలా అనేకసార్లు గౌరవనీయుల్నికూడా దూషించాడు. అంతకూ నేను సహించి వూరుకోలేక అలా తిట్టడం కూడదని చెప్పేవాడ్ని. అప్పుడు వాళ్ళతోపాటు నన్నుగూడా కలిపి తిట్టడం ప్రారంభించేవాడు....

ఇక నా విషయంలో ...బాల్యంనుండి నన్నంటే నన్నే గాదు. ఈడువచ్చిన వారిని కొట్టటానికి సంశయించేవాడు కాదు. రోజు రోజు ఒక్కొక్క కర్ర విరిగిపోతుండేది. చిన్నవాడు చస్తాడుగదా అని వూరుకునేవాడనుకున్నావా! ... కాదు ... తన గొప్పకోసం ... తన తృప్తికోసం ... కొడుకుల్ని బానిసలుగాచేసి దూషించి, హింసించి నానాబాధలు పెట్టుతున్నాడంటే లోకులు నమ్ముతారా! ఇంకా ప్రపంచం నమ్ముతుందా!

సంఘంలో బానిసత్వం ఇలా చెలరేగుతుందంటే ఎవరికే తెలుసు.

పిల్లల్ని ఎన్నిసార్లు ఎక్కువగా కొట్టితే అన్ని రెట్లు గౌరవం వచ్చేదనుకునేవాడు పాపం! కాని కన్న కొడుకుల బాధ... విచారం...కష్టాలు చూచేవాడు కాదు,

అలా చిన్నప్పటినుండి నేనేగాదు నా తమ్ముళ్ళు, చిన్ని చెల్లాయిలు నాతోపాటు దెబ్బలు పంచుకున్నారు.

మమ్మల్ని ఆ బానిసత్వాన్నుంచి బయటకు తప్పించటానికి ఎవరూ సాహసించేవాడు లేరు. నా తండ్రి క్రూరత్వాన్ని చూచి...

చిన్నప్పట్నుంచి ఓర్పుతో అలాగే దెబ్బలుతింటూ సహించి వూరుకుంటూండే వాళ్ళం...

పెద్దవాళ్ళమయ్యాం ...పెద్దవాళ్ళ మయ్యాంకదాయని మాకు సంతోషమెక్కడ. ఇంకా తిట్లు, కొట్టడం జరుగుతూనే వుంది. బానిసత్వంలో మ్రగ్గి...తండ్రి క్రూరత్వానికి గురియై బాధపడలేని రోజు లేదు.

"తండ్రి కొడుకుల్ని బాధపెట్టుతున్నాడంటే నువ్వు నమ్ముతావా రామూ!" అన్నాడు నాతో.

"లేద"న్నాను.

"నువ్వే నమ్మలేకున్నావు. ఇంకా లోకం ఎలా నమ్ముతుంది" చెప్పు మరి...

అందుచేతనే నా దీన చరిత్రను విన్నవించుకోటానికి చాలా సంశయించాను.

రామూ! నువ్వు నమ్ముతావో నమ్మవో ఒకనాడు నా తమ్ముణ్ణి పట్కారుతో తోడలు పీకేశాడు. అబ్బా! నేను చెప్పలేను రామూ...ఎంత ఘోరం...ఆనాడు చూడలేకపోయాను. తండ్రిమీదకురికి కంఠం పట్టుకొని అమాంతంగా నులుపేద్దామని వుద్రిక్తుడయ్యాను...కాని శక్తిహీనుడ్ని...నేనొక బానిసను ఆ నాడు...

తమ్ముడు ఏడుస్తుంటే నేనూ ఏడుస్తూ ఇద్దరం ఏడుస్తూ వుండిపోయాం ...

... ... ... ...

నేను చదువుకుంటున్న రోజుల్లో ఖర్చు ఎక్కువగా వుండేది. డబ్బివ్వటానికి పంచప్రాణాలు పైకెగిరిపోతుండేవి. ఇచ్చినా తను అంచనా ప్రకారం కొద్దిగా ఇస్తుండేవాడు...కాని నాకు అది చాలుతుండేది కాదు. మామయ్య అంతా ఇచ్చేవాడు పాపం!...

అంతకూ ఇంత డబ్బు ఎక్కణ్ణుంచి తెస్తున్నావని గదమాయించేవాడు. తను పెట్టేది లేదు. ఇంకొకరు పెట్టుంటే తిననివ్వడు. ఇంకా బ్రతికేదెలా?

ఇచ్చిన డబ్బుకే ఖర్చు అంతా ఒక పుస్తకంలో వ్రాయమంటుండేవాడు. ఒక రోజున ఈ బాధలన్నీ పడలేక ఎదిరించాను. "ఫెళ్లున" లెంపకాయ పదిమందిలోను వేశాడు. ఆ దెబ్బతో శరీరంలోని అవయవాలన్ని క్రుంగిపోయి బానిసనై అలాగే గోడకు వ్రేలాడిపోయాను. ఎదిరిస్తే తండ్రికెదురు మాట చెప్పాడని లోకులంతా నన్నే దూషిస్తారు. మెదలకుండా వూరుకుంటే ఇంకా నాలుగు తంతున్నాడు.

ముందు చూస్తే నుయ్యి..... వెనుక చూస్తే గొయ్యి.....చూస్తూ కూర్చున్న పెద్దమనుష్యులు ఆ కర్కోటకుణ్ణి గదమాయించలేక పోయారు...

మాట్లాడితే వాళ్ళనుకూడా తంతాడేమో అనుకున్నా.

రామూ! పూర్తిగా బానిసనయ్యాను. నా భగ్న జీవితాన్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ కన్నీరు గార్చాను. ఎంత ఏడిస్తే ఎవరి గుండెలు కరుగుతాయి.

ఇవన్నీ లోకానికి ఎఱుకపరిస్తే నమ్ముతుందో నమ్మదో యని నా భయం. చిన్నప్పట్నుండి ఈ కష్టాలన్నీ నా తమ్ముళ్లు, చిన్ని చెల్లాయిలు నన్ను చూచి సహించగల్గారు.

పెద్దవాళ్ళమయ్యాం. ఇంకా ఎన్నాళ్లు ఈ బానిసత్వం. నా తమ్ముడు వుద్రిక్తుడయ్యేవాడు తండ్రిని కొట్టడానికి... నన్ను చూచి ఆగిపొయ్యేవాడు.

కాని తండ్రి క్రూరత్వం మితిమీరి పోయింది. ఇంకా క్రూరత్వాన్ని సహించలేకపోయాం...

నా కష్టాలన్నింటిని ఒక వుత్తరంలో మా మామయ్యకు వ్రాస్తున్నాను.

తండ్రి క్రూరత్వం...ఆ క్రూరత్వానికిగురియై బాధలుపడుతున్న నేను,తమ్ముళ్లు, చిన్నిచెల్లాయిలు అందర్ని గురించి వ్రాస్తున్నా. అప్పుడే యమదూతలా ప్రత్యక్షమయ్యాడు ఎక్కణ్ణుంచి వచ్చాడో మరి...

వచ్చాడు నాదగ్గఱకు...

చూచాడు వ్రాస్తున్న వుత్తరం...

బలవంతాన తీసుకున్నాడు...వుత్తరం చించేద్దామనుకున్నా. కాని నిస్సహాయుణ్ణి. బలవంతానలాక్కుంటే అలాచూస్తూ వూరుకోవల్సి వచ్చింది...

దాన్ని చూచి తమ్ముడు పళ్లు పటపట కొరుకుతున్నాడు. వుత్తరాలు వ్రాసుకుంటుంటే తనకెందుకు. ఎక్కడ్నుండైనా వుత్తరాలు వస్తేచాలు తనే ముందు చింపి చూస్తాడు. ఎన్నోసార్లు అలాచేశాడు. అలా చెయ్యకూడదని చెప్పుదామనుకున్నా నోరు రాలేదు. తమ్ముడు కారాలు మిరియాలు నూరుతున్నాడు తండ్రిమీద. తమ్ముడికి కన్నగీటాను వూరుకోమని. చల్లారిపోయింది వుద్రిక్తహృదయం...

వుత్తరమంతా చదివాడు.

"రయి" మంటూ సింహంలా లేచాడు నామీదకు. కొట్టడానికి కర్ర తెచ్చి పైకి ఎత్తాడు అంతే...

చూస్తున్న తమ్ముడు ఒక్కసారి ఎగిరి అమాంతంగా కంఠాన్ని పెనవేశి నొక్కుతున్నాడు. ఆయన కొంచంసేపు గుంజాడు కాని లాభంలేకపోయింది. తమ్ముడ్ని విడదీయటానికి ప్రయత్నించాను. వుద్రేకంలో వున్న తమ్ముడు నన్ను త్రోశేసాడు. ఆ దెబ్బతో పదిగజాలు తూలిపోయాను. తండ్రినికొట్టి పారిపోయాడు. తండ్రి లేచి నన్ను కొట్టాడు ఆకోపంతో...ఇక సహించలేక పోయాను. నేనిలా తప్పించుకువచ్చాను రామూ! తండ్రి క్రూరత్వంనుండి బానిసత్వంనుంచి తప్పించుకువచ్చాను. ఇక పాలను ముంచినా నీటముంచినా రక్షించే భారం నీదే రామూ! అంటూ నా రెండుచేతులు పట్టుకొని కన్నీరు గార్చాడు...